రాజీ మార్గం శ్రేయస్కరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: కక్షిదారులు రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా కేసుల పరిష్కారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ, భూమి తగాదాలు సంబంధిత విషయాల్లో చాలా వరకు కేసులు కాకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తప్పనిసరి కేసులయితేనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం చాలామంది బైక్ ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, భార్యాభర్తలు గొడవలు ఎక్కువ వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత వరకు స్టేషన్‌లో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కేసుల వల్ల ఆర్థిక పరమైన సమస్యలు, మానసిక ఆందోళన, మనస్తాపానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రధానంగా వాహనదారులు లైసెన్స్, ఇన్సురెన్స్ కలిగి ఉండాలని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. విలువైన సమయం వృథా చేయకుండా లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, మౌనిక, డీఎస్పీ తిరుపతిరావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరులో కేసుల పరిష్కారం

కేసుల విచారణ జరుపుతున్న జడ్జి సరిత

తొర్రూరు: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి మట్ట సరిత పలు కేసులకు పరిష్కారం చూపారు. 1227 పెట్టి కేసులను పరిష్కరించి రూ. 2,55,110 జరిమానా విధించారు. 17 క్రిమినల్ కేసుల్లో కక్షిదారులు రాజీపడగా, 15 కేసులకు సంబంధించి రూ.1,15,400, 55 ఎక్సైజ్ సంబంధిత కేసుల్లో నిందితులకు రూ.2.85లక్షల జరిమానా విధించారు. వీరితో పాటు మరో 6 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రశాంతమైన జీవనం సాగించడానికి రాజీ మార్గం ఎంతో ఉత్తమమైందన్నారు. లోక్ అదాలత్‌లు కేసుల పరిష్కారానికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ గణేశ్, ఆనంద్, న్యాయవాదులు మహేశ్, వెంకటేశ్, సైదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

దాశరథి ఉద్యమ స్ఫూర్తి యువతకు ఆదర్శం

చిన్నగూడూరు, జూన్ 8: తొలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచి ప్రజల్లో చైతన్యం నింపిన దాశరథి రంగాచార్యుల జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు జీ శ్రీనివాస్ అన్నారు. శనివారం రంగాచార్యుల 9వ వర్ధంతి సందర్భంగా చిన్నగూడూరు మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆ మహనీయుడి విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్యులు తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసి జైలు జీవితం అనుభవించారన్నారు. కోఆప్షన్ సభ్యుడు మూసిన్‌బేగ్, పాత్రికేయులు శ్రీపాల్, ప్రవీన్, నరేశ్, శ్రీనివాస్, సాంబయ్య, శేఖర్ ఉన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

గార్ల, జూన్ 8: మండల కేంద్రంలో రూ.5కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు గుండె నాగమణి అన్నారు. శనివారం సీహెచ్‌సీని వారు సందర్శించి, రోగులు, వైద్యాధికారితో మాట్లాడారు. సీహెచ్‌సీలో 24 గంటలు వైద్యులు ఎందుకు అందుబాటులో ఉండడం లేదని, 12 గంటల వరకు డ్యూటీ చేసి వెళ్తే రోగుల పరిస్థితి ఏమిటని వైద్యాధికారిని ప్రశ్నించారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, కలెక్టర్ దృష్టికి సీహెచ్‌సీ పరిస్థితిని తీసుకెళ్తామన్నారు. శ్రీను, అజ్మీరా సుమలత, దేవా, రాము పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

మండల ప్రత్యేకాధికారి మరియన్న

పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మరియన్న

నెల్లికుదురు, జూన్ 7: అమ్మ ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి మరియన్న, మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ రాములు అన్నారు. శనివారం మండలంలోని దుప కుంట, పీజీ, హేమ్లా తండాల్లో ఎంపీడీవో బాలరాజుతో కలిసి మండల ప్రత్యేకాధికారి, భగ్నా తండా ప్రాథమిక పాఠశాలను ఎంఈవో సందర్శించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో అన్ని పాఠశాలల్లో 100శాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 31 పాఠశాలల్లో రూ. 1.11 కోట్లతో తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, మైనర్ రిపేర్లు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనుల నిర్వహణను స్థానిక ప్రధానోపాధ్యాయులు, వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సొంటిరెడ్డి యుగేంధర్‌రెడ్డి, ప్రేమ్‌చంద్, మహేందర్‌రెడ్డి, రమేశ్, కోమల, సోమయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

డోర్నకల్, జూన్ 8: గొల్లచర్ల గ్రామంలో ఖాజాభాయ్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు రెండోరోజూ హోరాహోరీగా కొనసాగాయి. క్రీడాపోటీలను తిలకించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు, క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు భీమనబోయిన సంతోష్, ఉపాధ్యక్షులు కొడవండ్ల యాదగిరి, చెట్టుపల్లి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శులు పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, కోశాధికారి సురేశ్, కార్యవర్గ సభ్యులు చందమహేశ్, భీమనబోయిన సాగర్ పాల్గొన్నారు.

నేడే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- సర్వం సిద్ధం చేసిన జిల్లా అధికారులు
- మొత్తం 12 సెంటర్లు, 4,412 మంది అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేడు జరుగనున్న పరీక్షకు సంబంధిత అధికారులతో శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 12 సెంటర్లను ఏర్పాటు చేశామని, మానుకోటలో 7, తొర్రూరులో 5 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎగ్జామ్‌కు మొత్తం మూడు రూట్లను, ఆరుగురు ఆఫీసర్లను, 34మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లను సిద్ధం చేశారు. జిల్లాలో 4,412 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారని, 82 మంది ఇన్విజిలేటర్లను సిద్ధం చేశారన్నారు.

జిల్లాలోని పరీక్షా కేంద్రాలివే..

మానుకోటలోని మహర్షి విద్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏకశిలా ఏంజిల్స్, ఎస్‌వీ విద్యాలయం, శ్రీచైతన్య హై స్కూల్, ఫాతిమా హైస్కూల్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కళాశాల, తొర్రూరులో ఆర్యబట్టా స్కూల్, గవర్నమెంట్ జూనియర్ కళాశాల, సమతా డిగ్రీ కళాశాల, సెయింట్ పాల్స్ హైస్కూల్, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో సెంటర్‌లను ఏర్పాటు చేశారు.

అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కేటాయించిన అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రాల వద్దకు అపరిచిత వ్యక్తులకు అనుమతి లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పరీక్ష సమయంలో స్థానికంగా ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయాలని ముందస్తుగా సమాచారం ఇచ్చామన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున మహిళలు గోరింటాకు వంటివి పెట్టుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ షూ కాకుండా చెప్పులు మాత్రమే వేసుకొని రావాలని, సెంటర్‌లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, తప్పనిసరిగా పరీక్ష నియమాలను పాటించాలన్నారు. గ్రూప్-1 పరీక్ష ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని, అభ్యర్థులు గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి : కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారులతో విత్తనాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. విత్తన డీలర్లు తప్పనిసరిగా నియమాలను పాటిస్తూ రైతులకు విత్తనాలు విక్రయించాలన్నారు. నిబంధనలు పాటించని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. వానకాల సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా అధికారులు సిద్ధంగా ఉంచాలన్నారు. విత్తన సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా సక్రమంగా జరగాలని, టాస్క్‌ఫోర్స్ బృందాలు, రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి తరచుగా దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్: డీఈవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల కోసం షెడ్యూల్ విడుదలైనందున జిల్లాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించి సీనియరిటీ, ఖాళీల జాబితాను ప్రదర్శించాలని, జూన్ 17న ప్రారంభమయ్యే ఎస్జీటీ క్యాడర్ బదిలీల సీనియారిటీ ప్రకారం సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో స్టేషనరీ విక్రయాలను నిలిపివేయాలి

తొర్రూరు: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనీఫాం, ఇతర స్టేషనరీ సామగ్రి విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ తొర్రూరుకు చెందిన స్టేషనరీ బుక్స్ వ్యాపారులు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గంజి దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలు చేపట్టడం వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విక్రయాలు చేపట్టొద్దని ఉత్తర్వులు జారీ చేసినా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూ మెసేజ్‌లు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టేషనరీ వ్యాపారులు శోభన్, ఉప్పలయ్య, వెంకట్, సూరిబాబు, వసంత్, చారి, సోమసుందర్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి

తొర్రూరు: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరులోని స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ ఏరియర్స్, సరెండర్ బిల్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పీఆర్‌సీ కమిటీ నివేదికను త్వరగా పూర్తి చేసి వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏలో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి టైం స్కేలు ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలో వెంటనే స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీ యూ ప్రధాన కార్యదర్శి జీ యా కూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, డీ చంద్రమౌళి, గుంటుక యాకయ్య, శ్రీనివాస్, రమేశ్, హరికృష్ణాచారి పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గార్ల, జూన్ 8: సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం గోదాం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, కేంద్రం ప్రభుత్వ తీసుకొచ్చిన నాలుగు లెబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అంబటి వీరస్వామి, మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సివిల్‌సప్లై హమాలీ కార్మికులు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ

పత్తి విత్తడంలో జాగ్రతలు తీసుకోవాలి

నర్సింహులపేట, జూన్ 8: రైతులు పత్తి, పసుపు విత్తనాలు విత్తే సమయంలో జాగ్రతలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏవో రామకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో మంద దామోదర్ రెడ్డి పొలంలో పత్తి విత్తే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ లోతులో పత్తి విత్తనాలు వేయలని, పసుపు వేసే ముందు దుక్కిలో పశువుల పెంట పోయాలన్నారు. ఎకరానికి డీఏపీ 50 కిలోలు వేసుకోవాలని, అంతర పంటగా మక్కజొన్న సాగు చేసుకుంటే ఆర్థికంగా లాభం ఉంటుందని తెలిపారు.

ఫ్రీజర్‌ను అందజేస్తున్న మాజీ సర్పంచ్ మమతారెడ్డి

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ వితరణ

తొర్రూరు, జూన్ 8 : మండలంలోని హరిపిరాల గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్ రావుల మమతారెడ్డి శనివారం ఫ్రీజర్‌ను బహూకరించారు. జీపీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి దేవయ్యకు అందజేసి మాట్లాడారు. మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో గ్రామంలో ఫ్రీజర్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రూ. 70వేల విలువ చేసే ఫ్రీజర్‌ను అందించినట్లు తెలిపారు. ప్రజలకు సంక్షేమ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామాభివృద్ధి కోసం సహకరిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంతోష్, ఎంపీటీసీ గోపమ్మ మల్లయ్య, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణ పక్కన ఉన్న బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌ను శనివారం సాయం త్రం ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానంలో కనీస మౌలిక వసతులు, విద్యార్థుల ఆట సామగ్రి, క్రీడా పోటీల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడల గురించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కుమారస్వామి, ప్రతాప్‌రెడ్డి, రామన్న ఉన్నారు.

రామోజీరావుకు నివాళి

చిన్నగూడూరు, జూన్ 8: ఈనాడు సంస్థల ఆధినేత రామోజీరావు మృతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి స్థానిక విలేకరుల ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. జర్నలిజానికి చేసిన సేవలను కొనియాడారు. శ్రీపాల్, నరేశ్, సాంబయ్య, మూసిన్‌బేగ్, డీఎస్ శ్రీను, నాగన్న, ప్రవీన్, విజయ్, శేఖర్, జీ శ్రీనివాస్ ఉన్నారు.

మరిపెడలో..

మరిపెడ: రామోజీరావు మృతికి మరిపెడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పర్వతం చంద్రశేఖర్, గండి విష్ణు తదితరులు సంతాపం తెలిపారు. పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలు విశేషమైనవని పేర్కొన్నారు. గంధసిరి ఉప్పలయ్య, అనంతరాములు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

రహదారిపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

కేసముద్రం, జూన్ 8: పెనుగొండ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుగులోత్ వీరన్న కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు శనివారం కేసముద్రం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మృతుడి బంధువులు మాట్లాడుతూ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని జమాండ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా గ్రామంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సర్కారు బడుల్లోని విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, ఉన్నత చదువు, ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత బుక్స్, దుస్తువులను అందిస్తారని, తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను గవర్నమెంట్ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఇందిర, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఉమ, ఉపాధ్యాయులు రోజారాణి, ప్రభావతి, మంజుల, మహేశ్వర్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఆంగ్లబోధన..

నర్సింహులపేట: సర్కారు బడుల్లో నాణ్యమైన ఆంగ్ల బోధన అందుతుందని, విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని గ్రామాలు, తండాల్లో ఉపాధ్యాయులు శనివారం బడిబాటలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ.. అర్హతలు, అనుభవం, సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు అన్నివర్గాల ప్రజలు ముందుకొస్తున్నారని తెలిపారు.

నర్సింహులపేట: బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

మరిపెడలో..

మరిపెడ: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అందుతుందని మరిపెడ జిల్లా పరిషత్ ఉపాధ్యాయురాలు మంచినీళ్ల సుధారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలోని 12, 13వ వార్డుల్లో బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఇంటింటా ప్రచారం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల రూపంలో దోపిడీతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడిద్దన్నారు. కార్యక్రమలో రజిత, సాహిన్ పాల్గొన్నారు.

మరిపెడ: బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

దంతాలపల్లి: కుమ్మరికుంట్లలో..

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

దంతాలపల్లి: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ బడిబాటలో భాగంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. శనివారం ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా బోధన తీరును విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.

NTW-318919

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.

NTW-318953

HEALTH CARE

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును.

సంప్ర॥ 6281476205, 9440325526

KMM_11679

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556 9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

JANGAON - 9182777565